పోలింగ్ కేంద్రాల పరిధిలో డ్రై డే

ప్రజాశక్తి -పాడేరు:

పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల ఫరిధిలో రెండు రోజుల పాటు డ్రై డేగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసారు. 13వ తేదీన పోలింగ్ జరగనున్నందున 11వ తేదీ సాయంత్రం 4 గంటల నుండి 13వ తేదీ పోలింగ్ ముగిసే వరకు సాయంత్రం 4 గంటల వరకు పాడేరు డివిజన్ ఫరిధిలో 11 మండలాలలో పోలింగ్ కేంద్రాల ఫరిధిలో 19 రిటైల్ అవుట్ లెట్లు, అరకు మండల ఫరిధిలో హరిత వేలీ రిసార్ట్స్, హరిత హిల్ రిసార్ట్స్, అనంతగిరి మండలంలో హరిత వేలీ రిసార్ట్స్, తైడా జంగిల్ బెల్స్ లో హరిత రిసార్ట్స్ లో టిడి-1 లైసెన్స్ షాపులకు ఈ డ్రై డే వర్తిస్తుందన్నారు. 11వ తేదీ సాయంత్రం 4 గంటల నుండి 13వ తేదీ పోలింగ్ ముగిసే వరకు సాయంత్రం 4 గంటల వరకు షాపులు మూసివేయాలని కలెక్టర్ ఉత్తర్వులలో ఆదేశాలు జారీ చేశారు.

ఏజెన్సీలో కోరెడ్ల రమాప్రభకు ఆదరణ

- గ్రామగ్రామానా మద్దతుదారుల విస్తృత ప్రచారం
- పిడిఎఫ్‌కు పట్టం కట్టే దిశగా గిరిజన పట్టభద్రుల ఆలోచనా సరళి
- ఆదివాసీల సమస్యల పట్ల ఆమెకే అవగాహన ఉందని విశ్వాసం

పాడేరులో ప్రచారం చేపడుతున్న కోరెడ్ల రమాప్రభ (ఫైల్ పొటో)

ప్రజాశక్తి - పాడేరు: ఈ నెల 13న జరుగనున్న ఉత్తరాంధ్ర శాసన మండలి ఎన్నికల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించే ఆలోచనలో ఏజెన్సీ పట్టభద్రులు ఉన్నట్టు అర్థమవుతోంది. ఆమె అల్లూరి జిల్లాలోని పాడేరు ఏజెన్సీలో ఇప్పటికే ప్రచారం పూర్తి చేశారు. ఆమె మద్దతుదారులు గ్రామగ్రామానా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అన్నిచోట్లా రమాప్రభకు మంచి ఆదరణ లభిస్తోంది.

250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థిగా సామాజిక కార్యకర్త, విద్యావేత్త డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అందరి నోళ్లలో నానుతున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సమస్యల ప్రాతిపదికన అంశాల వారీగా ఆమె గొంతెత్తిన తీరు అందరినీ ఆలోచింపజేస్తోంది. తనను గెలిపిస్తే ఉత్తరాంధ్ర సమస్యలపై తన వాణిని మండలిలో వినిపిస్తానని ఆమె చెబుతున్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సాధన, వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రక్షణ, రైల్వే జోన్ సాధన, ఉద్యోగ, ఉపాధ్యాయులను వేధించే సిపిఎస్ రద్దుకు ఉద్యమం, నిరుద్యోగుల కోసం ఈ ప్రాంతంలో పరిశ్రమల సాధనకు పోరాటాలే అజెండాగా తనదైన శైలిలో డాక్టర్ కోరెడ్ల రమాప్రభ పని విధానం ఉంది. ఈ విషయాన్నే ఇంటెలిజెన్స్ నివేదికలు సైతం తాజాగా రూఢీపర్చడం విశేషం.

రాజకీయ పార్టీలతో విసిగి వేసారిన మేధావులు, పట్టభద్రులు

గత శాసన మండలి ఎన్నికల్లో ఈ ప్రాంతం నుంచి గెలిచిన బిజెపి అభ్యర్థి పివిఎన్.మాధవ్ ఉత్తరాంధ్ర అభివృద్ధికి చేసిన కృషి, తెచ్చిన నిధులూ శూన్యం. ఉత్తరాంధ్రకు అత్యంత కీలక పరిశ్రమగా వెలుగొందుతున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి అమ్మకానికి పెట్టగా కార్మికవర్గం పోరాడుతుంటే ఆయన చెప్పిన మాటలు విస్మయం గొలుపుతున్నాయి. స్టీల్‌ప్లాంట్ ఇక్కడే ఉంటుందని కాకపోతే ప్రైవేటీకరణ అవుతుందని' అతడు వ్యాఖ్యానించడం పట్ల ఈ ప్రాంత మేధావులు, కార్మికులు, నిరుద్యోగులు, ఉద్యోగులు తీవ్ర స్థాయిలో ఆగ్రహంతో ఉన్నారు. రాష్ట్రంలో అధికారం వెలగబెడుతున్న వైసిపి మీనమేషాలు లెక్కిస్తూ స్టీల్‌ప్లాంట్ వ్యవహారంలో కేంద్ర విధానాన్ని వ్యతిరేకించకుండా దోబూచులాడుతోంది. ఆ పార్టీ తరపున మండలి ఎన్నికల బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్ రియల్ ఎస్టేట్ వ్యాపారి. ప్రజా సమస్యలపై అవగాహన లేదు. ఈ విషయాలపైనా చర్చలు సాగుతున్నాయి. ఉత్తరాంధ్రలోని వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టే గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ నిర్వహణపైనా ఈ ప్రాంతంలో వ్యతిరేకత భగ్గుమంటోంది. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి చెందిన అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు వైసిపి వైఫల్యాలను సరైన రీతిలో ఎత్తిచూపడం లేదు. అతనికీ ప్రజా సమస్యలపై పని చేసిన చరిత్ర లేదు. విద్యావేత్తగా చెప్పుకుంటూ నిరుద్యోగుల ఓట్లను కొట్టేసే ప్రణాళికతో ఆయన ఉన్నట్లు పలువురు చెబుతున్నారు.

పిడిఎఫ్ అంటేనే విలక్షణత

2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో తొలిసారిగా పిడిఎఫ్ అనే పదం వినిపించింది. సామాజిక బాధ్యత, ప్రగతిశీలమైన వ్యక్తుల సమూహంగా పిడిఎఫ్‌కు గణనీయ స్థానం ఉంది. ఐఐటి రామయ్యగా పిలవబడే చుక్కా రామయ్య, ప్రఖ్యాత రాజకీయ, సామాజిక, ఆర్థిక వ్యవహారాల విశ్లేషకులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, డాక్టర్ గేయానంద్, గతంలో రెండు పర్యాయాలు ఉత్తరాంధ్ర పట్టభద్రుల స్థానంలో గెలిచి ప్రజల నోట్లో నాలుకలా మారిన ఎంవిఎస్.శర్మ, ప్రస్తుత ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రహ్మణ్యం, కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ, వై.శ్రీనివాసుల రెడ్డి సేవలు అందరికీ తెలిసినవే. వారి వారసత్వాన్ని నిలిపే సత్తా కోరెడ్ల రమాప్రభది అని పట్టభద్రులు చెప్పుకుంటున్నారు. 25 ఏళ్లుగా విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో పిల్లలు, పెద్దలు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థి, యువజన రంగాల అభివృద్ధికి తన వంతుగా సామాజిక సేవలో పేరొందిన ఆమె వైపునకు అందరి దృష్టి మరలుతోంది.

గిరిజన అభ్యున్నతికి రమాప్రభ ప్రాధాన్యతలివీ..!

ఏజెన్సీలో గిరిజన అభ్యున్నతికి పిడిఎఫ్ అభ్యర్థిగా తన ప్రాధాన్యతలను ఓటర్లకు వివరిస్తూ కోరెడ్ల రమాప్రభ ఇప్పటికే ఆకట్టుకున్నారు. జిఒ నెంబర్ 3 రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించడం, గిరిజన ప్రత్యేక డిఎస్‌సి సాధించడం, 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం పటిష్టంగా అమలుకు కృషి, ఆదివాసీ మాతృభాషా వాలంటీర్లకు ఉద్యోగ భద్రత, గిరిజన ఆశ్రమాల్లో హెల్త్ అసిస్టెంట్ల నియామకం, సౌకర్యాల పెంపు, గిరిజన ప్రాంతాల్లో ఇంజినీరింగ్, నర్సింగ్, బిఇడి, 20 ఉన్నత కళాశాలల ఏర్పాటుకు కృషి, అరకు, చింతపల్లి, పాడేరు జ్యుడిషియల్ కోర్టుల్లో జడ్జిల నియామకానికి కృషి, గిరిజన ఉద్యోగులు ఉపాధ్యాయులకు నివాస గృహాలు, ఆసుపత్రిలో పూర్తిస్థాయి సిబ్బంది నియామకం వంటివి రమాప్రభ ప్రాధాన్యతలుగా ఉన్నాయి. గిరిజనుల అటవీ వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర, కోల్డ్ స్టోరేజీల నిర్మాణం, టిఆర్‌టిల సర్వీసు క్రమబద్ధీకరణ, గిరిజన యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు చిన్న తరహా పరిశ్రమల విస్తరణకు కృషి తదితరాలపై ఆమె మండలిలో వాణి వినిపించనున్నట్టు ఇప్పటికే స్పష్టం చేశారు. గతంలో రంపచోడవరం ఏజెన్సీలో గిరిజన జీవితాలపై ఆమె అధ్యయనం చేశారు. పాడేరు ఏజెన్సీలో విశేష సేవలందించారు. ఆమె వ్యక్తిత్వం ఎలాంటిదో ఇప్పటికే ఈ ప్రాంత పట్టభద్రులకు తెలుసు. ఈ నేపథ్యంలోనే పలుచోట్ల వారంతా ఆమెకు మద్దతుగానూ ప్రచారం చేపడుతున్నారు.

ఉద్యోగులపై వేధింపులు ఆపండి

- సిపిఎం ఆధ్వర్యాన ధర్నాలు

ప్రజాశక్తి-పాడేరు: జీవో 3 రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని, సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా పిలుపునిచ్చిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం పాడేరులో మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎల్.సుందర్ రావు మాట్లాడుతూ, జీఓ 3 ను రద్దు చేసి నేటికీ రెండున్నర సంవత్సరాలు పూర్తి అవుతున్నా చట్టబద్ధ కల్పించలేదన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగ నోటిఫికేషన్ లేక గిరిజన యువత తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. సిఎం జగన్ సీపీస్ రద్దు హామీలు అమలు చేయకపోగా గత సంవత్సర కాలంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు సకాలంలో చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాలికి లక్కు, డి. బొజ్జన్న, చిట్టిబాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేపడుతున్న సిపిఎం నేతలు

కక్ష సాధింపు మానుకోవాలి: సురేంద్ర

అరకులోయరూరల్: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులపై ప్రభుత్వం వేధింపులు చర్యలు మానుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, జిఓ 1 పేరుతో బహిరంగ ప్రదేశాల్లో ఆందోళనలు, సభలపై ఆంక్షలు పెట్టి ప్రజల గొంతును నొక్కడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, నాయకులు పొద్దు బాలదేవ్, జి.బుజ్జి బాబు, టి.జోషి, పి.నానిబాబు, పి.రామన్న, కె మగ్గన్న, కూర్మన్న, మురళి వివి.జయ, కె.మగ్గన్న, జె.భగత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు

డిఇఒ కార్యాలయం వద్ద యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి-పాడేరు టౌన్: సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణిలో వ్యవహరిస్తోందని యుటిఎఫ్ జిల్లా నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న దుందుడుకు చర్యలను విడనాడాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల విషయంలో ప్రభుత్వం ఆలంభిస్తున్న నిరంకుశ వైఖరికి నిరసనగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని డిఇఒ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ, రకరకాల యాప్‌ల పేరుతో ఒత్తిడి పెంచి మానసిక వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాట తప్పి జిపిఎస్ అంటున్నారని విమర్శించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.విల్సన్ బాబు, వి.మహేష్, అసోసియేట్ అధ్యక్షులు సిహెచ్.నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కె.రఘునాథ్, పి.దేముడు, ఎస్.కన్నయ్య పాల్గొన్నారు.

ఆందోళన చేపడుతున్న యుటిఎఫ్ నేతలు

బాలుర గురుకుల పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి-పెదబయలు: స్థానిక గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో గిరిజన గురుకులం కార్యదర్శి ఆదేశాల మేరకు డిప్యూటీ సెక్రటరీ ప్రభాకర్ బందం గురువారం రాత్రి పర్యటించారు. 5నుండి 9 తరగతులకు విద్యార్థుల నైట్ స్టడీ, ఉపాధ్యాయుల టీచింగ్ డైరీ, లెస్సన్ ప్లాన్ మెథడ్స్ పర్యవేక్షణ చేశారు. నాడు నేడు మనబడి, జగనన్న కిట్స్‌పై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో విడి విడిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు పలు డిమాండ్లతో వినతిపత్రాన్ని అందజేశారు. ఇప్పటి వరకు పది నెలలకే వేతనాలు మంజూరు చేస్తున్నారని, 12 నెలలూ , సమాన పనికి సమాన వేతనం మంజూరు చేయాలని కోరారు. హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. 2010 నుండి ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు పిఆర్‌సి వర్తింప చేయలేదని, 2022 పిఆర్‌సి ప్రకారం వేతనాలు మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఐటిడిఎ పరిదిలో ఇష్టానుసారంగా అధికారులు బదిలీ చేయకుండా నియమనిబంధనలు పాటించాలని కోరగా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్ళి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సెక్రటరీ ప్రభాకర్ తెలిపారు.

వినతిపత్రాన్ని ఇస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

సుపర్ణ మృతదేహం

ఫిట్స్‌తో ఆశ్రమ పాఠశాల విద్యార్థిని మృతి

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని కొమ్మిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న మాతె సుపర్ణ (11) శుక్రవారం ఉదయం అనారోగ్యంతో అకస్మాత్తుగా మృతి చెందింది. ప్రాథమిక సమాచారం ప్రకారం... శుక్రవారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో మాతె సుపర్ణకు ఫిట్స్ రావడంతో ఆమె అకస్మాత్తుగా కిందపడిపోయి నురగలు కక్కుకుంటుంది. ఇది గమనించిన పాఠశాల అధికారులు హుటాహుటిన కంతారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విద్యార్థినిని పరీక్షించిన వైద్యులు సుపర్ణ అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతురాలి స్వగ్రామం నాతవరం మండలం, సుందరకోట పంచాయితీ పరిధి తొరడ. శుక్రవారం సాయంత్రం విద్యార్థిని మృత దేహాన్ని తల్లిదండ్రులకు అప్పటించినట్టు తెలిసింది. ఈ విషయమై పూర్తి వివరాలు తెలియాల్సిఉంది.

గోదావరి డెల్టాకు నీరు విడుదల

ప్రజాశక్తి -సీలేరు

గోదావరి డెల్టా పంట పొలాలకు సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి జలాశయం నుండి శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 2500 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామని ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 17 నుంచి మార్చి 8 వరకు గోదావరి డెల్టాకు రోజుకు 3000 క్యూసెక్కుల చొప్పున 5.26 టీఎంసీలు నీటిని డొంకరాయి జలాశయం ద్వారా గోదావరి డెల్టాకు నీటి విడుదల చేసినట్లు చెప్పారు. సీలేరు కాంప్లెక్స్ పరిధి సీలేరు, డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి అనంతరం 4000 క్యూసెక్కుల నీటిని గోదావరి డెల్టాకు విడుదలయ్యేదని పేర్కొన్నారు. ఏపీ జెన్కో ఉన్నతాధికారి ఆదేశాల మేరకు ఈనెల 8న సాయంత్రం నుంచి నీటి విడుదలను నిలిపివేశామన్నారు. మళ్లీ గోదావరి డెల్టాకు నీటి అవసరాలు ఉండడంతో ఇరిగేషన్ అధికారులు రోజుకు 2500 క్యూసెక్కులు నీటిని విడుదల చేయాలని కోరడంతో ఉన్నతాధికారుల అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 9 గంటలకు డొంకరాయి జలాశయం గేట్లు ద్వారా 2500 క్యూసెక్కుల విడుదల చేస్తున్నామని తెలిపారు. ఈనెల చివర వరకు నీటి విడుదల కొనసాగుతుందన్నారు. జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ అనంతరం యథాతథంగా 4000 క్యూసెక్కులు నీరు గోదావరి డెల్టాకు విడుదలవుతుందని వెల్లడించారు. జోలాపుట్ బలిమెల, గుంటవాడ, డొంకరాయి జలాశయాల్లో ఆంధ్ర వాటా 25 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నాయని, సీలేరు కాంప్లెక్స్ పరిధిలో జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తికి, తాగునీటికి జూన్ చివరి వరకు పొదుపుగా వినియోగించుకోవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

టీచర్లు లేకుండా ఉత్తీర్ణత సాధ్యమా?

ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ కాకుండానే, ఈ విద్యాసంవత్సరం పూర్తి కావస్తుందని, అలాంటప్పుడు విద్యార్థుల ఉత్తీర్ణత ఎలా సాధ్యపడుతుందని ఎంపిపి కారం లక్ష్మి ప్రశ్నించారు. మండలంలోని సోములు గూడెం బాలికల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఎంపిపి లక్ష్మి, సిపిఎం నాయకులు సందర్శించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఆమె మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో 308 విద్యార్థులకు గాను, ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారని, ఫిజిక్స్, సోషల్, ఇంగ్లీష్, సైన్స్ బోధించేందుకు ఉపాధ్యాయులు లేరని హెచ్ఎం వివరించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన విద్యార్థుల చదువుల పట్ల శ్రద్ధ వహించడం లేదని పేర్కొన్నారు. అనంతరం చింతరేవుపల్లి, కన్నాయిగూడెం, తృష్టివారిగూడెం పాఠశాలలను ఎంపిపి సందర్శించారు. అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా పాఠశాలల్లోనూ ఉపాధ్యాయుల కొరత ఉందటాన్ని ఆమె గుర్తించారు. తక్షణమే ఆశ్రమ, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని ఎంపిపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి చిన్నబాబు, నాయకులు పంకు సత్తిబాబు, వడ్లది రమేష్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి

పట్రా ముత్యం ఆశయ సాధనకు కృషి

వర్ధంతి సభలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-చింతూరు

2013 మార్చి 10న మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన సిపిఎం నాయకులు పట్రా ముత్యం ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు అన్నారు. మండలంలోని తుమ్మల గ్రామంలో పట్రా ముత్యం స్థూపం వద్ద ఆయన వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు కుంజ సీతారామయ్య, పల్లపు వెంకట్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మొట్టుమ్ రాజయ్య అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ మాట్లాడుతూ పట్రా ముత్యం ఈ ప్రాంత ప్రజలతో మమేకమై, గిరిజనులను ఐక్యం చేసి వారి సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. చెక్కుచెదరని ఆయన క్రమశిక్షణను సహించలేని మావోయిస్టులు ముత్యంను ఇంటి నుంచి తీసుకువెళ్లి హత్య చేశారని పేర్కొన్నారు. హత్యలతో పార్టీ అభివృద్ధిని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే సాగునీటి వనరులను అభివృద్ధి చేయాలని, విద్య వైద్య సదుపాయాలు మెరుగుపరచాలని తెలిపారు. వీటిని సాధించడమే ముత్యంకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యం కుటుంబ సభ్యులు పట్రా రమేష్, జయమ్మ, ముట్టు నాగేశ్వరరావు, ఠాగూర్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యం స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

జీడిమామిడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కొయ్యూరు

వేసవిలో అగ్నిప్రమాదాలు పొంచి ఉన్నందున జీడిమామిడి తోటలున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని కొయ్యూరు సిఐ ఎ.స్వామినాయుడు అన్నారు. ఇటీవల మండలంలోని పలుగ్రామాల్లో జీడిమామిడి తోటలు దగ్ధమై రైతులు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో శుక్రవారం సిఐ మండలంలోని చుట్టుబంద, భీమవరం గ్రామాల్లో పర్యటించారు. రైతులతో కలిసి కాలిపోయిన జీడిమామిడి తోటలను పరిశీలించారు. ప్రమాదాలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడిమామిడితోటలు అగ్నికి కాలిపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, వారుపడిన శారీరక శ్రమ కూడా వృథా అవుతోందని పేర్కొన్నారు. పంటచేతికొచ్చే సమయంలో జరుగుతున్న ఈ అగ్నిప్రమాదాల కారణంగా జీడిమామిడి రైతులు కుదేలైపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నూతన అధ్యక్షులు దొరబాబు

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- అడ్డతీగల

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) మండల నూతన కార్యవర్గం ఎన్నిక మండల విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం జరిగింది. ఎన్నికల అధికారిగా యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కె.కృష్ణ వ్యవహరించారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి సోర్లం రాజుబాబు, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ తేజోరావు హాజరయ్యారు. యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులుగా ఎస్.నాగప్రసాద్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బొంకు దొరబాబు, లోతా మధు రెడ్డి, మండల సిపిఎస్ కమిటీ కన్వీనర్‌గా చారపు చినబాబు దొర, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాస్, కె.కమల రత్నం, కోశాధికారిగా కెవి.రాఘవులు ఎన్నికయ్యారు. ఎఫ్‌డబ్ల్యుఎస్ కార్యదర్శిగా జగదీష్, పత్రిక కార్యదర్శిగా పి.వెంకట రమణ, ఆడిటర్‌గా చింతోజీ, నాగేశ్వరరావు, కార్యదర్శులుగా పి.అప్పారావు, సిహెచ్.లోవరాజు, వి.బాలరాజు, డి.అశోక్, జి.వెంకటరమణ, సిహెచ్.సాయిప్రసాద్, ఎస్.కుశలన్న, జిల్లా కౌన్సిలర్లుగా జి.తేజరావు, సిహెచ్.చిన బాబు దొర, జెవిబి.రమణమ్మ, ఎ.గాంధీరెడ్డి, కమలరత్నం, బి.వెంకటేశ్వర్లు ఎన్నుకోబడ్డారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది.

కర్ర పెండలం, చిలకడ దుంప ఉత్పత్తులపై శిక్షణ

ప్రజాశక్తి - రంపచోడవరం

మండలంలోని పందిరిమామిడి వద్ద ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో కర్ర పెండలం, చిలకడ దుంపలతో తయారు చేసే ఉత్పత్తులపై నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రెండో రోజు శుక్రవారం కార్యక్రమంలో పెద్దాపురం ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.జానకి మాట్లాడుతూ కర్ర పెండలం, చిలకడ దుంపల్లో ఉండే పోషక విలువల ప్రాముఖ్యతను వివరించారు. వాటితో చిప్స్, బిస్కెట్లు, మురుకులు మిక్చర్, అప్పడాలు, సుగ్గు బియ్యం పాస్తా, జల్లి పండి బొబ్బట్లు తదితర ఉత్పత్తుల తయారీ విధానం, వాటి మార్కెట్ ప్యాకింగ్ పద్ధతులను తెలియజేశారు. వాటి తయారీ ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని చెప్పారు. కెవికె శాస్త్రవేత టి.క్రాంతి కుమార్, కె.వీరాంజనేయులు, ఎస్.ఆదర్శ, పి రాజశేఖర్, పలు మండలం నుండి మహిళలు పాల్గొన్నారు.

శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త

ఉద్యోగుల ముఖ హాజరు తప్పనిసరి

స్పందన సమస్యల పరిష్కారంపై శ్రద్ధ : కలెక్టర్

స్పందనలో వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు.

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు విధిగా ముఖ హాజరు వేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. కార్యాలయాలకు సకాలంలో హాజరు కావాలని సూచించారు. ప్రతీ ఉద్యోగి సమయ పాలన పాటించాలని చెప్పారు. ఐటిడిఎ సమావేశ మందిరంలో ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ వి.అభిషేక్ తో కలిసి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 45 ఫిర్యాదులు స్వీకరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి స్పందన సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ముఖ హాజరు వేయకుండా ఉద్యోగుల జీతాలు డ్రా చేస్తే వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులు హాజరు కాకుండా దిగువ స్థాయి అధికారులను పంపిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కోర్టు కేసులను పర్యవేక్షించాలని సూచించారు. కోర్టు కేసులకు కౌంటర్లు దాఖలు చేయాలని చెప్పారు. పాడేరు మండలం దిగుమోదాపుట్టు నుండి ఎగుమోదా పుట్టు గ్రామం వరకు రోడ్డు నిర్మించాలని, ఎగుమోదాపుట్టులో సామాజిక భవనం నిర్మించాలని గ్రామస్తులు కె.శాంతి, కె.లచ్చిన వినతి పత్రం సమర్పించారు. పెదబయలు మండలం గుల్లేలు పంచాయతీ జంగం పుట్టు గ్రామానికి చెందిన ఎస్. వండన్న, టి.చిట్టిబాబు జంగంపుట్టు నుండి కించారు వరకు రోడ్డు నిర్మించాలని కోరారు. పాడేరు మండలం వంజంగి సర్పంచ్ వంతాల బొంజుబాబు వై.సంపాలు, పోతురాజుమెట్ట, ఎస్.కొత్తూరు, దొడ్డిపల్లి, బొర్రమామిడి గ్రామాలకు రోడ్లు నిర్మించాలని వినతిపత్రంలో కోరారు. పాడేరు మండలం బడిమెల గ్రామానికి చెందిన గడుగు నాగమణి, జి.శాంతమ్మ క్రైం సాస్త్రి తదితర 32 మంది రైతులు పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని అర్జీని అందజేశారు. పాడేరు పట్టణంలోని ఐక్యలపనుకు మెట్టవీధికి రోడ్డు, తాగునీటి సదుపాయాలు కల్పించాలని గెమ్మెలి రాంబాబు వినతిపత్రం అందజేసారు. హుకుంపేట మండలం మత్స్యపురం ఉప సర్పంచ్ పి.వర్ధన్నదొర పాతరు మత్స్యపురం, ఓటగొయ్యి, గున్నమామిడి, గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీడిమ్యా డిఎ ఐ.కొండల రావు, డిఎంహెచ్ఒ జమాల్ బాషా, డిఇఒ సలీమ్ బాషా, జీడిమ్యా ఇఇలు డివిఆర్ ఎం.రాజు, కె.వేణుగోపాల్, పీఆర్ కొండయ్య పడాల్, పిఐయు ఇఇ కె.లావణ్య కుమార్, ఆర్అండ్‌బి ఇఇ బాల సుందరబాబు, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్ బి.ఎస్ నంద్, డిపిఒ కొండలరావు, డిఎల్‌పిఒ పిఎస్ కుమార్, ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దొన్నుదొర జన్మదిన వేడుకలు

దొన్నుదొర జన్మదిన వేడుకలో స్థానిక నేతలు

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలో టీడీపీ ఎస్టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్ను దొర జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కుంభాకర గ్రామంలో వైస్ సర్పంచ్ కిరసాని.మత్స్యరాజు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేశారు. హుకుంపేట మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరకు అసెంబ్లీ ఎస్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొర్రా సంతోష్ కుమార్, టీడీపీ సీనియర్ నేతలు బొడ్డ శ్యామ్, ఎస్టి సెల్ అధికార ప్రతినిధి పట్టిబోయిన శంకర్ నాయుడు, మాజీ సర్పంచ్ సత్తాకా బొంజుబాబు పాల్గొన్నారు.

తక్కువ బరువు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - పాడేరు: అంగన్వాడీ కేంద్రాలలో తక్కువ బరువున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని, పౌష్టికాహారం వారు సక్రమంగా తిని విధంగా అంగన్వాడీ కార్యకర్తలు, వర్కర్లు భాధ్యత వహించాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు డివిజన్ పరిధిలోని ఐసిడిఎస్ అధికారులతో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లల ఆరోగ్యం పట్ల అత్యంత శ్రద్ధ తీసుకోవాలని, వారు సరిగా ఆహారం తీసుకునేలా డాక్టర్ సలహాలు తీసుకోవాలని సూచించారు. ఆదేవిధంగా మరీ తక్కువ బరువున్న పిల్లలను దగ్గరలోని ఆసుపత్రిలో పౌష్టికాహార పునరావాస కేంద్రానికి తరలించి పౌష్టికాహారం అందించాలన్నారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలను 15 రోజుల పాటు వారిని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ, మెనూ ప్రకారం సమయానికి ఆహారం అందిస్తే తప్పనిసరిగా బరువు పెరుగుతారని పాటు అనారోగ్య సమస్యల నుండి విముక్తులవుతారని కలెక్టర్ వివరించారు. ఇందుకు అంగన్వాడీ కార్యకర్త, వర్కర్ భాధ్యత వహించాలని, సూపర్వైజర్లు ఆయా కేంద్రాలపై దృష్టి సారించి క్రమం తప్పకుండా సందర్శించాలని తెలిపారు. తల్లులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. బరువు తక్కువున్న పిల్లల వివరాలతో ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించి ప్రతి రోజు వారి వివరాలు నమోదు చేయాలని, వారిలో వచ్చిన మార్పులను తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి సూర్యలక్ష్మి, జిల్లా ఆసుపత్రిపర్యవేక్షకులు కృష్ణారావు, ఐసిడిఎస్ సిడిపిఓలు, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-పాడేరు: ఈ నెల 13న జరగనున్న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలలో అర్హులందరూ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఓటర్లకు పిలుపునిచ్చారు. కలెక్టర్ చాంబర్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్, జేసి శివ శ్రీనివాసు, డిఆర్ఓ పి.అంబేద్కర్‌లు శానమండలి ఎన్నికలలో ఓటు నమోదుకు సంబంధించి పోస్టర్ ను గురువారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసామని, ఉదయం 8గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు తీసుకున్నామని కలక్టర్ స్పష్టం చేసారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోడల్ అధికారులు, జోనల్, రూట్, పోలింగ్ అధికారులు, సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లను, ఫ్లయింగ్ స్క్వాడ్‌ను వెబ్ కాస్టింగ్‌కు వీడియో గ్రాఫర్లను, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఇంచార్జులను, నియమించటంతో పాటు వారికి రెండు విడతల శిక్షణ పూర్తి చేసామని కలెక్టర్ వివరించారు. అర్హులైన ఓటర్లకు స్లిప్పుల పంపిణీ 95 శాతం పూర్తి అయిందని, అందుబాటులో లేనివారికి రెండు రోజుల్లో అందజేస్తామని తెలిపారు. బ్యాలెట్ పేపర్‌లో ఏ విధమైన గుర్తులు ఉండవని, పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు మాత్రమే ఉంటాయని, ఓటరు ఎంచుకున్న మొదటి ప్రాధాన్యత అభ్యర్థికి 1, రెండవ ప్రాధాన్యత అభ్యర్థికి 2, మూడవ ప్రాధాన్యత అభ్యర్థికి 3, ఆ విధంగా ఎంచుకున్న అభ్యర్థుల ప్రాధాన్యతను అనుసరించి ఆ క్రమంలో నంబరు మాత్రమె వేయాలని కలెక్టర్ సూచించారు. ఆ నంబరును పోలింగ్ బూత్‌లో సిబ్బంది సరఫరా చేసిన ఊదా రంగు స్కెచ్ పెన్ తో మాత్రమే నమోదు చేయాలని, ఏ ఇతర పెన్ను లేదా బాల్ పెన్ను వినియోగించరాదని కలక్టర్ తెలిపారు. ఓటరు మొదటి ప్రాధాన్యత అభ్యర్థికి 1 వేయాలని, తరువాతి ప్రాధాన్యతలు వేసినా, వేయకపోయినా అది ఓటరు ఇష్టమేనని స్పష్టం చేసారు. ఓటు హక్కు వినియోగంలో 1 తప్పనిసరిగా వేయాలని, 1 వేయకుండా మిగిలిన నంబర్లు వేస్తే ఓటు చెల్లదని కలక్టర్ తెలిపారు. బ్యాలెట్ పేపర్ పై ఎటువంటి రాతలు, గుర్తులు, టిక్కు మార్కు లేదా ఇంటు మార్క్ వేసినా, సంతకం చేసినా ఆ ఓటు చెల్లదని, ఒకే వ్యక్తికీ రెండు ప్రాధాన్యత ఓట్లు వేసిన చెల్లదని, రెండు పేర్లకు మధ్యలో ఓటు వేసినా అది చెల్లదని కలక్టర్ స్పష్టం చేసారు. అదే విధంగా తెలుగు అంకెలు, రోమన్ అంకెలు వేయరాదని, అక్షరాలలో నంబరు వేయరాదని, అటువంటి ఓట్లు కూడా చెల్లవని కలక్టర్ సూచించారు.

ప్రశ్నించే గొంతును గెలిపించండి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా ప్రచారం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శానసమండలి నియోజకవర్గంలో 250 ప్రజాసంఘాలు, ఉద్యమపార్టీల మద్దతుతో పోటీలో ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ ప్రజాసంఘాల విసృత్తంగా ప్రచారం చేస్తున్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ అభ్యర్థి గెలుపు ఎంత అవసరమో వివరిస్తూ ఓటను అభ్యర్థిస్తున్నారు..

పాడేరులో ఎన్నికల ప్రచారంలో ప్రజాసంఘాల నేతలు

అనంతగిరిలో ప్రచారంలో గంగరాజు, మొస్య తదితరులు

దుంబ్రిగుడలో ప్రచారంలో సిఐటియు, గిరిజన సంఘం నేతలు

జి.మాడుగులలో ప్రచారంలో మాట్లాడుతున్న ధర్మన్న పడాల్

ముంచంగిపుట్టులో గిరిజన సంఘం నేతల ప్రచారం

ప్రజాశక్తి-పాడేరు:. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ కు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోనంగి చిన్నయ్య పడాల్ కోరారు. శుక్రవారం పలు పంచాయతీ గ్రామాలలో పట్టభద్రుల ఓటర్లను అభ్యర్థిస్తూ ప్రచారం చేసిన ఆయన బెన్నవరం పంచాయతీ, పినపాడు గ్రామంలో జరిగిన భాషా వాలంటీర్ల సమావేశంలో పాల్గొన్నారు. గిరిజన యువత ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా నిస్వార్ధంగా ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్, భాష వాలంటీర్ల సంఘం రాష్ట్ర నాయకులు కె.సరుబు నాయుడు, కే.వీరయ్య, ఎం చిట్టిబాబు, కే.లక్ష్మణరావు, పి.కుమారి, జి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అనంతగిరి:: రమాప్రభను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జెడ్పిటిసి దీసరి గంగరాజు కోరారు. టోకూరు సర్పంచ్ కిల్లో మొస్య, గిరిజన సంఘం నాయకులతో కలిసి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఓటర్లను మభ్యపెట్టేందుకు అధికార పక్షాలు రంగం సిద్ధం చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల గిరిజన సంఘం నాయకులు ఎస్.నాగులు, జె.సుబ్బారావు పాల్గొన్నారు.

దుంబ్రిగూడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర సమస్యలపై ప్రశ్నించే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన పర్యటించి ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలతో పాటు కార్మిక, కర్షకుల, గిరిజన సమస్యలపై శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నిరంతరం ప్రశ్నిస్తున్నారన్నారు. వీటితోపాటు ఉత్తరాంధ్ర అభివృద్ధిపై కూడా ప్రశ్నిస్తున్నారని చెప్పారు. పట్టభద్రులైన విద్యావంతులు ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నించే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్పి పోతురాజు, గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.సూర్యనారాయణ, మండల నాయకుడు టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

జి.మాడుగుల: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజా సంఘాల నేతలు కోరారు. గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాగిన ధర్మన్నపడాల్, సిఐటియు మండల కార్యదర్శి జె. దీనబంధు, నాయకులు జి.మధు, గిరిజన సంఘం నాయకులు వీరన్న పడాల్, శ్రీకాంత్, ధర్మారావు మండలంలోని ప్రభుత్వ విద్యాసంస్థలలో శుక్రవారం విస్తత ప్రచారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ, సమస్యలు చట్టసభల్లో వినిపించాలంటే పిడిఎఫ్ అభ్యర్థి కోరేడ్ల రమాప్రభ గెలుపుతోనే సాధ్యపడుతుందని తెలిపారు.

ముంచింగిపుట్టు: పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎం ఎం శ్రీను కోరారు. మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘము జిల్లా ఉపాధ్యక్షులు నరసయ్య, మండల అధ్యక్షుడు గల్లెల నారాయణ, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్, రామదాసు, డోంబ్రు, తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలే అజెండా

ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నా ప్రశ్నించని వైసిపి
బరిలో ప్రజా సమస్యలపై అవగాహన లేని అభ్యర్థి
సీతంరాజు సుధాకర్‌కు పట్టభద్రుల ఓట్లడిగే హక్కుందా?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'వైసిపి తరుపున ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి బరిలోకి దిగిన సీతంరాజు సుధాకర్‌కు అధికార పార్టీ జెండా నీడ తప్ప ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రజా సమస్యల పట్ల ఎలాంటి అవగాహనా, అజెండా లేదు. పోరాటం చేసిన ఒక్క సందర్భమూ లేదు. ఆయనకు ఓట్లు అడిగే హక్కు ఇంకెక్కడిది' అని పలువురు పట్టభద్రులు బాహాటంగా చెప్పేస్తున్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల్లోనూ దీనిపైనే పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. పోటీలో ఉండాలంటే పార్టీ మద్దతు ఒక్కటేనా ఇతర గుణగణాలేవీ అవసరం లేదా ? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వ్యాపారాలు చేసుకుంటూ వాటి పురోభివృద్ధికి పార్టీ జెండా నీడన ముందుకెళ్లిపోవాలనుకునే నేతల్లో ఆయనొకరని

వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్

చెప్పుకుంటున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి సర్కారు ప్రైవేటీకరణ చేస్తున్నా నోరుమెదపని వైనం సదరు అధికార అభ్యర్థి సొంతం. వేల సంఖ్యలో కార్మికులు, కార్మిక కుటుంబాలే కాకుండా ప్లాంట్‌పై ఆధారపడి జీవించే వేల కుటుంబాలు, వ్యాపారాలు విశాఖపట్నం ప్రత్యేకత. ఇలాంటి ప్రత్యేక పరిస్థితి చేజారిపోతున్నా పట్టని అధికార వైసిపిలో ఉన్న సదరు అభ్యర్థి స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఓట్లు అడిగే హక్కును కోల్పోయారనే చెప్పాలి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను తెగనమ్మాలని మోడీ సర్కారు కుట్రలపై కుట్రలు సాగిస్తున్నా ఉత్తరాంధ్ర పట్టభద్రుల తరపున మండలిలో ప్రశ్నిస్తానని ప్రకటించిన దాఖలా లేదు.

సమస్యలపై ఏనాడూ గళమెత్తని అభ్యర్థి

విశాఖకు అత్యంత కీలకమైన రైల్వే జోన్‌పైనా కినుక వహించడం, వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఎత్తేసినా, ఉత్తరాంధ్ర ప్రాంత ఆర్థిక పరిపుష్టిని దెబ్బ తీసే చర్యలపైనా ఏనాడూ అధికార పార్టీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా బరిలోకి దిగిన ప్రస్తుత అభ్యర్థి గళమెత్తలేదు. వెనుకబడిన జిల్లాలుగా రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే ముద్రపడ్డ శ్రీకాకుళం, విజయనగరం గ్రామీణ ప్రాంతాలకు ఎంతో కొంత ఆసరాగా నిలిచే విశాఖలోని ప్రభుత్వ రంగ సంస్థలు, విశాఖ నగరంపై ఆధారపడి జీవించే వేల కుటుంబాల జీవనాన్ని దెబ్బతీసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలున్నాయి. ఈ తరహా ప్రజా సమస్యల అజెండాపై పిడిఎఫ్ అభ్యర్థి అయిన డాక్టర్ కోరెడ్ల రమాప్రభ మినహా ప్రస్తుతం బరిలో నిలిచిన తెలుగుదేశం, వైసిపి, బిజెపి నేతలు పోరాడడం కాదు కదా కనీసం ఏ కోసానా స్పందించలేదంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఉత్తరాంధ్రకు రూ.వేల కోట్లు ఆర్థిక ప్యాకేజీ కేంద్రంలోని బిజెపి ఇస్తానని ఇవ్వకుండా మోసం చేసినా రాష్ట్రంలో 2019లో పగ్గాలు చేపట్టిన వైసిపి ఏనాడూ ప్రశ్నించలేదు. ఆ పార్టీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఇవేమీ పట్టడమే లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించకపోవడం, ప్రశ్నిస్తే వేధింపులకు గురిచేయడం వంటి సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఏ ముఖం పెట్టుకుని వారిని అధికార వైసిపి ఓట్లడగడానికి వెళ్తోంది అంటూ పట్టభద్రులే ప్రశ్నిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ప్రలోభాలు...పంపకాలే అజెండా

చేతిలో అధికారం ఉండడంతో ఉద్యోగులు, అధికారులపై బెదిరింపులకు పాల్పడడం, ఎయు వైస్ ఛాన్సలర్ హోటల్‌లో ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ప్రజా సంఘాలకు దొరికిపోవడం తెలిసిందే. ప్రభుత్వ వైన్ షాపుల్లోని సూపర్ వైజర్లు సైతం అధికార పార్టీకి అనుకూలంగా ఓటు ఓయాలంటూ శుక్రవారం సాయంత్రం విశాఖ ఉత్తర నియోజకవర్గంలో అధికార పార్టీ నేత కెకె.రాజు ఆధ్వర్యాన సమావేశం నిర్వహించిన వీడియో బయటపడింది. ఉత్తరాంధ్ర ప్రాంతమంతటా తెలంగాణ రాష్ట్ర స్టిక్కర్లుండే కార్లను వినియోగించి వెండి వస్తువులను బహుమతులుగా శుక్రవారం సాయంత్రం సీతంరాజు సుధాకర్ తన ఇంటి నుంచి పంపిస్తున్న వీడియో, ఫొటోలు కూడా బయటపడ్డాయి. ఇవన్నీ అధికారిక అక్రమాలే. వీటన్నింటిపైనా జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఆ పని ఆయన చేయడం లేదు.

13న పోలింగ్‌లో బుద్ధిచెప్పడం ఖాయం

అధికార వైసిపి కేవలం తన శక్తియుక్తులన్నీ ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, డబ్బు, ఇతర బహుమతులను పంపిణీ చేసే అంశాలపైనే దృష్టిసారించింది. చెప్పడానికి అజెండా లేదు. దొడ్డిదారులు, దొంగ పనులపైనే ఆ పార్టీ కార్యాచరణ ఉన్నట్టు కనిపిస్తోంది. వాటిని పట్టభద్రులు చైతన్యంతో తిప్పికొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఎక్కడికక్కడే వారి ఎత్తులను చిత్తు చేస్తున్నారు. పోలింగ్ రోజైన ఈ నెల 13న ఇదే ప్రతిబింబించనున్నదని పలువురు చెబుతున్నారు.

సమర్థవంతంగా ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, లెక్కింపుపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కౌంటింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన మాన్యువల్‌ను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకొని విధులను విజయవంతంగా నిర్వహించాలన్నారు. శుక్రవారం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించిన విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, మన్యం, శ్రీకాకుళం జిల్లాల అధికారులు, కౌంటింగ్ సిబ్బందితో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ నిర్వహణ అన్నిటికంటే చాలా ముఖ్యమైన బాధ్యతని తెలిపారు. ఎన్నికల్లో పోలింగ్, బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూంలకు చేర్చడం, లెక్కింపు ముఖ్య భాగాలని పేర్కొన్నారు. వైలెట్ స్కెచ్ పెన్ ఉపయోగించి వేసిన ఓట్లు మాత్రమే చెల్లుబాటు అవుతాయని అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఎలెక్టోరల్ రోల్, బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్స్ చాలా ముఖ్యమైనవని అన్నారు.

కోరెడ్ల రమాప్రభ విజయానికి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి: ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక సంఘాల సమస్యలపై శాసనమండలిలో తమ గళాన్ని వినిపించేందుకు ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పట్టభద్రులైన సిబ్బందిని కలిసి రమాప్రభకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గంట శ్రీరామ్, ఎ.బాలకృష్ణ, బి ఉమామహేశ్వరరావు, పెంటకోట శ్రీను, కాళ్ల తేలయ్య బాబు, భాస్కర్ రావు, ఎస్ రమణ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ మండలంలో చౌడేపల్లి, కుమార పురం, అచ్యుతాపురం సంతలో శుక్రవారం డివైఎఫ్ఐ జిల్లా నాయకులు కె.సోమినాయుడు విస్తృతంగా ప్రచారం చేశారు. ఓటర్లను కలిసి రమాప్రభకు ఓటు వేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఆయన ప్రచారం చేశారు.

ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు ఆధ్వర్యాన ఎలమంచిలి మండలంలో ప్రచారం చేశారు. ఎలమంచిలిలో న్యాయవాదులను, జంపపాలెం, సోమలింగపాలెం, పెదపల్లి, కొక్కిరాపల్లిటౌన్‌లో ప్రైవేట్ స్కూళ్లలో పట్టపద్రులను కలిసి రమాప్రభని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సన్యాసిరావు మాస్టారు, సిపిఎం అభిమాని పద్మనాభరావు, కోరుమిల్లి సత్యనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు మండలంలోని అమృతపురం, సూరెడ్డి పాలెం, గొర్లివాని పాలెం, సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలు, ప్రభుత్వ జూనియర్ కాలేజి, అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం జరిగిన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి. ప్రభావతి మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలపై శాసన మండలిలో పోరాడే అభ్యర్థిని కోరెడ్ల రమాప్రభను ప్రజాసంఘాలు బలపర్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జక్కాన సత్యనారాయణ, జక్కాన రాము, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పాడ సత్యవతి, సీఐటీయూ నాయకులు మొల్లేటి గౌరీశ్వర రావు, ఎర్ర సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

రమాప్రభకు మద్దతుగా సిపిఐ ప్రచారం

అనకాపల్లి : పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ సిపిఐ, ఏఐటియుసి, విద్యార్థి సంఘాలు శుక్రవారం ప్రచారం నిర్వహించాయి. సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ శాసనమండలికి మేధావులను పంపడానికి బదులుగా జగన్మోహన్ రెడ్డి వ్యాపారస్తులను, మద్యం ఇసుక కాంట్రాక్టర్లను పంపించే చర్యలకు పూనుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ, దేవుడు బాబు, ఫణీంద్ర, వి.రాజు, వి కన్నబాబు, విత్తనాల పోతురాజు పాల్గొన్నారు.

పెందుర్తి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ 94వ వార్డు రవినగర్ భాష్యం పాఠశాలలో ప్రజా సంఘాల నేతలు కరపత్రాలు పంచుతూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నేత బి. రమణి మాట్లాడుతూ శానసమండలిలో ఉత్తరాంధ్ర సమస్యలు, నిరుద్యోగుల వాణి వినిపించాలంటే అది పిడిఎఫ్ అభ్యర్థుల వల్లే సాధ్యమన్నారు. ప్రశ్నించే తత్వం, పోరాడే మనస్తత్వం, చిత్తశుద్ధి ఉన్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు ప్రథమ ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో..

గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ గెలుపు కోరుతూ జనవిజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు ఎస్‌వికె పరుశురాం ఆధ్వర్యంలో లంకెలపాలెం, అగనంపూడి, కూర్మన్నపాలెం ప్రాంతాల్లో విద్యాలయాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని పాఠశాలలకు, పట్టభద్రుల ఓటర్ల ఇళ్లకు వెళ్లి ప్రజాసంఘాల మద్దతుతో పోటీలో ఉన్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని అభ్యర్థించారు. బడ్జెట్ స్కూల్ సమస్యల పరిష్కారానికి రమాప్రభ గెలుపు అవసరాన్ని వివరించారు.

పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు భెల్ కార్మికుల మద్దతు

గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు భెల్ కార్మిక ప్రతినిధులైన, సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటివి ప్రకాష్, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి పివిఎన్ రాజు తమ మద్దతు ప్రకటించారు. ఈమేరకు శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో 250 ప్రజాసంఘాల మద్దతునిస్తున్న రమాప్రభకు తమ మద్దతు ఉంటుందన్నారు. అన్ని కార్మిక సంఘాలతో కార్మిక సమస్యలపై పనిచేసిన అనుభవం రమాప్రభకు ఉందన్నారు. ఉత్తరాంధ్ర వాణి, కార్మిక, కర్షక, ఉద్యోగ, నిరుద్యోగ సమస్యలపై శాసనమండలిలో ప్రస్తావించి, ప్రశ్నించే సత్తా డాక్టర్ రమాప్రభకు ఉందని, అందుకే కార్మికసంఘాల తరపున ఆమెకు మద్దతు ప్రకటించినట్లు వెల్లడించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక ఎంపిపి పాఠశాల ఆవరణలో ఈనెల 11న శనివారం కాకినాడ అంజు ఆసుపత్రి సహకారంతో ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లబ్బర్తి ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరంలో అంజు ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. రోగులు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డుతో పాటు తమ పాత రిపోర్టులు ఉంటే వాటిని తీసుకురావాలని కోరారు. ఆపరేషన్లకు వచ్చే రోగులకు రవాణా, భోజనం, వసతి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దిరాజు కోరారు.

దగ్ధమైన జీడి మామిడి తోట

జీడి మామిడి తోట దగ్ధం

ప్రజాశక్తి - అడ్డతీగల : మండలంలోని భీముడు పాకల గ్రామానికి చెందిన గంత పండమ్మ, చిలకల సీతకు చెందిన జీడి మామిడి తోట అగ్నికి ఆహుతైంది. అడవి ప్రాంతానికి దగ్గరగా ఉన్న ఈ తోటలో అడవికి వెళ్లేవారు సిగరెట్, చుట్ట కాల్చి పాడవేయడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఆకులు రాలే సీజన్ కావడంతో మంటలు వ్యాపించాయని పేర్కొన్నారు. కాపుకు వచ్చిన జీడి మామిడి తోట కాలి బూడిద కావడంతో ఆ రైతులిద్దరూ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అధికారులు స్పందించి వారి జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని కోరారు.

గిరిజన గ్రామాల్లో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ పరిధి గదబ, నేరేడుపల్లి, రాళ్లగడ్డ గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి సౌమ్య గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం, రక్తహీన తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సౌమ్య మాట్లాడుతూ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, జ్వరాలు ప్రబలితే వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించి వెంటనే వైద్య సేవలు పొందాలని సూచించారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తినరాదని, కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. గర్భిణులు తరచూ ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, గిరిజనులు మూఢనమ్మకాలు విడనాడి వైద్యంపై దృష్టి సారించాలని సూచించారు. నాటు మందు, పసరు మందులను ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎన్.త్రినాథ్, సిహెచ్ఓ వరలక్ష్మి, ఏఎన్ఎం అరుణకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘన వీడ్కోలు

ప్రజాశక్తి - కొయ్యూరు : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం ఘనంగా వీడ్కోలు దినోత్సవం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీపీ, తహశీల్దారు, ఎంపిడిఒ, స్థానిక ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఆటపాటలతో అలరించారు. పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు స్థానిక ఆర్ఐ దుమంతి సత్యనారాయణ ప్లాంక్‌లను బహూకరించారు.

ములకలపాడులో ఆధార్ శిబిరం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని ములకలపాడులో ఆధార్ శిబిరాన్ని చీడిపాలెం పంచాయతీ సర్పంచి సోమన్న దొర శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ అప్‌డేట్, మార్పులు, చేర్పులు అవసరమైన వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంచాయతీతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆధార్ సేవలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేటర్లు భూదేవి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.